సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 28 । జూలై । 2023



త్యాగం, ధర్మనీతికి ప్రతీక.. మొహర్రం

మొహర్రం ఏర్పాట్లు పూర్తయ్యాయి. 29వ తేదీ ప్రత్యేక కార్యక్రమాలకు పశ్చిమ ప్రకాశంలో సర్వం సిద్ధం చేశారు. - 8లో..



క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు

పోలీసు కుటుంబాల పిల్లలు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఎస్పీ మలికాగర్గ్ పిలుపునిచ్చారు. ఐఐటీల్లో సీట్లు సాధించడం అభినందనీయమని అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33.7/25

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఒంగోలు వచ్చిన డీజీపీ



పోలీసు అతిథి గృహాన్ని పరిశీలిస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

ఒంగోలు టౌన్: రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం రాత్రి ఒంగోలు వచ్చారు. నెల్లూరు నుంచి విజయవాడ వెళ్తూ మార్గం మధ్యలో ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చారు. ఎస్పీ మలికాగర్గ్ డీజీపీకి పూలమొక్క అందజేశారు. సుమారు గంట పాటు ఉన్న ఆయన.. ఎస్పీతో పాటు జిల్లా పోలీసు అధికారులతో పలు విషయాలపై చర్చించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో ఆధునిక సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన పోలీసు అతిథి గృహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

టార్గెట్‌బాల్ పోటీల్లో కొణిజేడు యువకుడి సత్తా



టంగుటూరు: అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీల్లో మండలంలోని కొణిజేడు యువకుడు సత్తా చాటాడు. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో జరిగిన అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీల్లో భారతదేశం తరపున 14 మందితో కూడిన బృందం పాల్గొంది. ఈ బృందంలో టంగుటూరు మండలం కొణిజేడు గ్రామానికి చెందిన వేమూరి ఆజీష్ కూడా ఉన్నాడు. పాకిస్థాన్, నేపాల్, మలేషియా, చైనా జట్లపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నారు. బంగ్లాదేశ్‌పై జరిగిన ఫైనల్స్‌లో ఓటమిపాలై ద్వితీయస్థానం సాధించి సిల్వర్ మెడల్ అందుకున్నారు. తనకు స్పాన్సర్ చేసిన ఒంగోలు శ్రీ సరస్వతి విద్యాసంస్థల కరస్పాండెంట్ రమణారెడ్డి, డైరెక్టర్లు శంకరరెడ్డి, గణేష్ రెడ్డికి ఆజీష్ కృతజ్ఞతలు తెలపగా, పలువురు ఆజీష్‌ను అభినందించారు.

ఒంగోలు కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవం



నియామకపత్రాలు అందుకున్న స్టాండింగ్ కమిటీ సభ్యులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థలో స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఐదుగురు కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారికి నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు గురువారం నియామకపత్రాలు అందజేశారు. 2023–24 సంవత్సరానికిగానూ స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకునేందుకు ఎన్నికలు నిర్వహించారు. ఐదుగురు సభ్యులను ఎన్నుకోవడం కోసం నామినేషన్లు స్వీకరించారు. ఐదుగురు మాత్రమే నామినేషన్లు వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారిలో 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ ఫాతిమాబీ, 35వ డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి శ్రీ గిరిజా శంకర్ శాండిల్య, 42వ డివిజన్ కార్పొరేటర్ సూకతోటి మస్తానమ్మ, 43వ డివిజన్ కార్పొరేటర్ కండె స్వాతి, 45వ డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస కుమారి ఉన్నారు. కార్యక్రమంలో ఏపీపీ కేవీ వెంకటేశ్వర్లు, డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవరావు, వేమూరి సూర్యనారాయణ (బుజ్జి), కార్పొరేటర్లు తాడి కృష్ణలత, బేతంశెట్టి శైలజ పాల్గొన్నారు.

అయిపాయె..!

అనుకున్నదొక్కటి..అయినదొక్కటి..బోల్తా కొట్టిందన్న చందంగా తయారైంది టీడీపీ నేత దామచర్ల జనార్దన్ పరిస్థితి. యువగళం పేరుతో నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రను పట్టుబట్టి ఒంగోలు వచ్చేలా చేసి తన మైలేజ్ పెంచుకోవాలనుకున్నారు. అయితే సీన్ రివర్స్ అయింది. నగరంలో నిర్వహించిన సభలో లోకేష్ తన ప్రసంగంలో టీడీపీని గెలిపించండి అని పిలుపునిచ్చారే తప్ప జనార్దన్ ప్రస్తావన తీసుకురాలేదు. దీంతో ఆయన, ఆయన అనుచరగణం నివ్వెరపోయింది. జనార్దన్ అభ్యర్థిత్వంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయ్యో జనార్దనా అంటూ పార్టీలోని ఆయన వ్యతిరేక వర్గం, రాజకీయనేతలు సెటైర్లు వేస్తున్నారు.



- వచ్చే ఎన్నికల్లో జనార్దన్ అభ్యర్థిత్వంపై అనుమానాలు
- లోకేష్ ఒంగోలు పర్యటన సందర్భంగా గందరగోళం
- దామచర్లను అభ్యర్థిగా లోకేష్ ప్రకటించకపోవడంపై చర్చ
- టీడీపీ కేడర్‌లో అంతర్మథనం
- దామచర్లకు టికెట్ లేదని జోరుగా ప్రచారం
- రూ.కోట్లు ఖర్చు చేసి లోకేష్‌ను తెచ్చుకున్నందుకు తలపట్టుకున్న జనార్దన్
- దామచర్ల కుటుంబంలోని కలహాలే కారణమా..?
- జయహో బీసీ సదస్సులో కూడా ప్రస్తావనే లేదు
- నాడు మామ..నేడు అల్లుడి చేతిలో జనార్దన్‌కు భంగపాటు

సాక్షిప్రతినిధి, ఒంగోలు: లోకేష్ యువగళం పాదయాత్ర ఒంగోలు టీడీపీలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. బుధవారం సాయంత్రం ఒంగోలు నగరంలోని ముంగమూరు రోడ్డు జంక్షన్‌లో నిర్వహించిన సభలో ఒంగోలు అభ్యర్థిత్వం విషయంలో లోకేష్ నర్మగర్భంగా మాట్లాడటమే ఇందుకు ప్రధాన కారణం. వచ్చే ఎన్నికల్లో ఒంగోలులో టీడీపీ విజయం సాధించాలి..పసుపు జెండా ఎగరాలి అన్నారే తప్ప దామచర్ల జనార్దన్‌ను గెలిపించాలని చెప్పకపోవడం జిల్లా టీడీపీ నేతల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ కేడర్‌లోనూ జనార్దన్ అభ్యర్థిత్వం విషయంలో అనుమానాలు రేకెత్తాయి. దీంతో 2024 ఎన్నికల్లో జనార్దన్‌కు టికెట్ లేదన్న ప్రచారం జోరుగా సాగుతోంది. లోకేష్ యువగళం పాదయాత్రకు రూ.కోట్లు ఖర్చుచేసి ఒంగోలులో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తే.. లోకేష్ ప్రసంగంతో ఆయన పరిస్థితి గాలితీసిన బెలూన్‌లా తయారైందన్న ప్రచారం ఆ పార్టీ శ్రేణుల్లో జోరుగా సాగుతోంది. యువగళం కార్యక్రమం కోసం జనార్దన్ వసూలు చేశాడా? లేక సొంత డబ్బు ఖర్చు చేశాడా? అన్న విషయాన్ని పక్కన పెడితే లోకేష్ పాదయాత్రతో మైలేజ్ సాధించాలన్న ఆయన ప్లాన్ రివర్స్ అయింది. ఒక దశలో వేదిక కింద నుంచి జనార్దన్ అనుచరులు డీజే..డీజే..డీజే అని గావుకేకలు పెట్టినా లోకేష్ పట్టించుకోలేదు. దీంతో జనార్దన్ అనుచరులు కూడా నిరాశలో ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. జనార్దన్ పరువు లోకేష్ నిలువునా తీశాడన్న విమర్శలు సైతం గుప్పుమంటున్నాయి. 2014 నుంచి 2019 వరకు బాగా పనిచేశాడు, జనార్దన్ మంచి వాడు, కష్టపడ్డాడు అన్న లోకేష్.. ఒంగోలు అభ్యర్థి జనార్దనే అని అనకపోవడంతో జనార్దన్ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇదిలా ఉంటే కొండపిలో ప్రస్తుత ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి చేతులను పైకెత్తి కొండపిలో స్వామిని గెలిపించండి.. మీకు అండగా ఉంటాడని స్వయంగా లోకేష్ ప్రకటించారు. అదేవిధంగా కనిగిరిలో ప్రత్యక్షంగా డాక్టర్ ఉగ్ర నరిసింహారెడ్డి అభ్యర్థి అని ప్రకటించకపోయినా పరోక్షంగా ఉగ్ర మీకు అండగా ఉంటాడు, వైఎస్సార్ సీపీ నాయకులను వదిలి పెట్టడు అని ప్రకటించారు. ఇక రెండో రోజు కూడా జయహో బీసీ సదస్సులోనైనా ఒంగోలు అభ్యర్థి జనార్దనే అని ప్రకటిస్తారేమోనని పార్టీ కేడర్ ఎదురు చూసింది. అసలు ఆ ప్రస్తావనే లేదు. దీంతో జనార్దన్ తలపట్టుకున్నట్లు కూడా జోరుగా ప్రచారం సాగుతోంది. తొలుత లోకేష్ యువగళం పాదయాత్ర ఒంగోలులో లేకపోయినా కావాలని తెచ్చుకున్నందుకు అపకీర్తి కొనక్కొచ్చుకున్నట్లు ఉందన్న భావన కూడా జనార్దన్ అభిమానుల్లో నెలకొంది.

కుటుంబ అంతర్గత కలహాలే కారణమా..?

దామచర్ల జనార్దన్ కుటుంబంలోని అంతర్గత కలహాలే దీనంతటికీ కారణమా అన్న ప్రచారం జోరందుకుంది. దివంగత మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు రాజకీయ వారసుల మధ్య వివాదాలు నెలకొన్నాయి. జనార్దన్ చిన్నాన్న కుమారుడు సత్యతో ఉన్న రాజకీయ వైరుధ్యం కారణమని అనుమానిస్తున్నారు. జనార్దన్ ఎమ్మెల్యేగా ఉన్న నాటి నుంచి సత్యకి జనార్దన్‌కు మధ్య రాజకీయంగా వివాదాలు పొడచూపిన విషయం అందరికీ తెలిసిందే. వీరిద్దరి మధ్య గొడవలు పార్టీ అధినేత చంద్రబాబు వద్దకు, లోకేష్ వద్దకు కూడా చేరాయి. ఇటీవల సత్య పార్టీ అధినేత చంద్రబాబుతో, లోకేష్‌తో సత్సంబంధాలు ఎక్కువగా నెరుపుతున్నారన్న ప్రచారం కూడా జరుగుతోంది. ఈ కారణంగానే జనార్దన్ అభ్యర్థిత్వాన్ని లోకేష్ ప్రకటించలేదా అన్న సందేహాలు లేకపోలేదు. దీనిపై జనార్దన్ కుటుంబం, బంధువులతో పాటు పార్టీ కేడర్‌లో తీవ్రమైన చర్చ జరుగుతోంది. తాజాగా జరుగుతున్న పరిణామాలపై జనార్దన్ ఆత్మీయులు మదన పడుతున్నట్లు తెలిసింది.

యువగళం వైఫల్యం...

లోకేష్ ప్రవర్తనతో జనార్దన్ అనుచరులు, అభిమానులు, పార్టీ కేడర్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఒంగోలు యువగళం పాదయాత్ర వైఫల్యం చెందినట్లేనన్నది స్పష్టమవుతోంది. ఒంగోలు నగరంలోని ముంగమూరు రోడ్డులో మొదటి రోజు బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఇరుకు సందులో ఏర్పాటు చేసినా, డబ్బులు ఖర్చు పెట్టి జనాలను తోలినా అనుకున్నంతగా లోకేష్ సదస్సుకు జనం రాకపోవడంతో వెలవెలబోయింది. దీనిపై లోకేష్ కూడా కొంత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

నాడు మామ..నేడు అల్లుడు...

ఒంగోలు వేదికగా హీరో బాలకృష్ణ నటించిన వీరసింహారెడ్డి ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ సందర్భంగా జనార్దన్ అన్నీ తానై ఏర్పాట్లు చేశారు. వేదిక విషయంలో హైడ్రామా చేశారు. ఫంక్షన్ సందర్భంగా బాలకృష్ణ సమక్షంలో సినిమా డైరెక్టర్ మలినేని గోపీచంద్ ప్రసంగంలో బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాత బాలకృష్ణ అయినా జనార్దన్ పేరు ప్రస్తావించలేదు. ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అప్పుడు కూడా జనార్దన్‌కు భంగపాటు తప్పలేదు. తాజాగా బాలకృష్ణ అల్లుడు నారా లోకేష్ సైతం జనార్దన్ పేరును అభ్యర్థిగా ప్రకటించకపోవడంతో మరో మారు నిరాశ తప్పలేదు.

వ్యాక్సినేషన్ పక్కాగా జరగాలి

- మిషన్ ఇంద్రధనస్సు లక్ష్యం సాధించాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్



వైద్యారోగ్య శాఖాధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: చిన్నారులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. వ్యాక్సినేషన్ ప్రక్రియపై వైద్యారోగ్య శాఖ అధికారులతో గురువారం ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో అమలవుతున్న ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా 5 సంవత్సరాల పిల్లలకు మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్‌లు, జాతీయ ఇమ్యూనైజేషన్ షెడ్యూల్‌లో పేర్కొన్న మిగిలిన అన్నిరకాల టీకాలు వేయాలన్నారు. రోగనిరోధక శక్తి పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుందన్నారు. ఆ మేరకు నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలన్నారు. 2023 చివరినాటికి మీజిల్స్, రూబెల్లా పూర్తిగా నివారించడం జరుగుతుందన్నారు. మిషన్ ఇంద్రధనస్సు మూడు దశల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆగస్టు నెలలో 7 నుంచి 12వ తేదీ వరకు, సెప్టెంబర్ 11 నుంచి 16వ తేదీ వరకు, అక్టోబర్ 9 నుంచి 14వ తేదీ వరకు మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం జరుగుతుందన్నారు. దానికి సంబంధించి లైన్ డిపార్ట్‌మెంట్ సహకారంతో మైక్రో ప్లానింగ్ సర్వేలో లబ్ధిదారులను గుర్తించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కార్యక్రమం చేపట్టాలన్నారు. పిల్లల వయసుకు తగినట్లుగా సూచించబడిన మోతాదులు ఇవ్వాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు వేసిన తర్వాత యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, టీబీ నివారణ అధికారి సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆపద్బాంధవుడు.. సీఎం జగన్

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

పెద్దారవీడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్ర ప్రజలను ఆపద్బాంధవుడిలా ఆదుకుంటున్నారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కొనియాడారు. మండలంలోని గొబ్బూరు గ్రామ సచివాలయ పరిధిలో బీసీ, ఎస్సీకాలనీల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధి గురించి, ప్రజా సమస్యల గురించి మంత్రి తెలుసుకున్నారు. ఇంటి స్థలాలు లేని వారిని గుర్తించి వెంటనే స్థలాలు మంజూరు చేయాలని, వీధుల్లో కరెంటు స్తంభాలు వేయాలని విద్యుత్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలు, రైతులు, మహిళలను దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు రూపొందించినట్లు చెప్పారు. అమ్మ ఒడి, ఆసరా, రైతు భరోసా, ఇలా ఏ పథకం తీసుకున్నా పేదల అభ్యున్నతి కోసమే ప్రవేశపెట్టారన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబు.. ఇప్పుడు మళ్లీ హామీలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. మరోమారు చంద్రబాబు మోసపు మాటలు నమ్మవద్దని ప్రజలను కోరారు. ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను కూడా సీఎం జగనన్న నెరువేరుస్తున్నారని చెప్పారు. అర్హులై ఉండి ఏ ఒక్కరూ కూడా ప్రభుత్వ పథకాల లబ్ధిని కోల్పోకూడదని, అలాంటి వారిని గుర్తించి వారికి కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు ఇప్పించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ గాలి మాటలను ప్రజలు నమ్మరని, ఏపీలో అమలవుతున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. పవన్‌కళ్యాణ్, చంద్రబాబు డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వారికి మరోసారి గుణపాఠం తప్పదని అన్నారు. సంక్షేమ పాలనతో ప్రజల గుండెల్లో సీఎం వైఎస్ జగనన్న సుస్థిరస్థానం పొందారని, రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే వస్తుందని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలన్నదే సీఎం జగనన్న అభిమతమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలిరెడ్డి కృష్ణారెడ్డి, సర్పంచ్ అంగిరేకుల ఆదినారాయణ, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, వైస్ ఎంపీపీ గుండారెడ్డి యోగమ్మ, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ ఎం.కృష్ణారెడ్డి, ఎంపీడీవో ఎం.నాసరురెడ్డి, డీఎల్‌డీఓ సాయి కుమార్, విద్యుత్, హౌసింగ్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రమేష్, శ్రావ్య, రవీంద్రారెడ్డి, ప్రతాపరెడ్డి, ఏఓ బుజ్జిబాయి, ఎంఈఓ పి.శ్రీనివాసులు, ఏపీఎం శ్రీనివాసులు, ఏపీఓ సాంబశివయ్య, మాజీ ఎంపీటీసీ వెన్నా పెద్దపోలిరెడ్డి, నాయకులు గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బత్తుల కాశయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

సినిమా ప్రమోషన్‌లా జయహో బీసీ

- పూర్తిగా ఉదయభాను షోలా మారిన వైనం
- నిలువునా పోయిన బీసీ నేతల పరువు
- ఏ ఒక్క నేతనూ వేదిక ఎక్కించకుండా షో నిర్వహణ
- బయట జిల్లాల నుంచి పిలిపించుకున్న వారిని బాధితులుగా పరిచయం
- బాధితులందరినీ మా అమ్మ ఆదుకుంటుందంటూ లోకేష్ ధాంబికాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న నారా లోకేష్

ఒంగోలు సబర్బన్: నగరంలో లోకేష్ యువగళం పాదయాత్రలో గురువారం రెండోరోజు నిర్వహించిన జయహో బీసీ సభ ఒక సినిమా ప్రమోషన్‌ను తలపించింది. అది లోకేష్ కార్యక్రమంలా కాకుండా యాంకర్ ఉదయభాను షోలా మారిపోయింది. జయహో బీసీ సదస్సు అంటే బీసీ నాయకులు, ఆయా వర్గాలకు ప్రాతినిథ్యం వహించే నాయకులు, లోకేష్ కలిసి భరోసా ఇస్తారనుకుంటే చివరకు అది యాంకర్ ఉదయభాను షోలా మారిపోయిందని సదస్సుకు వచ్చిన నాయకులే గుసగుసలాడుకున్నారు. నగరంలోని పాత గుంటూరు రోడ్డులో ఏ–1 ఫంక్షన్ హాలు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో జయహో బీసీ వేదిక ఏర్పాటు చేశారు. ముందు రోజు బుధవారం రాత్రి 11 గంటలకు బసచేసిన గుడారంలోకి వెళ్లిన లోకేష్.. మరుసటిరోజు సాయంత్రం 5.30 గంటలకు జయహో బీసీ వేదిక వద్ద ప్రత్యక్షమయ్యాడు. ఈ మధ్యలో ఎలాంటి కార్యక్రమాలూ నిర్వహించలేదు. అంటే దాదాపు 18.30 గంటల పాటు గుడారంలోనే లోకేష్ గడిపాడు. ఇకపోతే జయహో బీసీ సదస్సు అంటే వేదిక మీదకు బీసీ నాయకులు, ఆయా వర్గాలకు చెందిన వారిని ఆహ్వానించి వారి సమస్యలు చెప్పిస్తారనుకున్నారు. కానీ, అక్కడకు వచ్చిన బీసీ నేతల్లో ఏ ఒక్కరినీ వేదికమీదకు ఆహ్వానించలేదు. దీంతో బీసీ నేతల పరువు నిలువునా తీసినట్లయింది. ఉదయభాను ప్రశ్నలు అడగటం, లోకేష్ తనదైన శైలిలో సమాధానాలు చెప్పడం అందరినీ ముక్కున వేలేసుకునేట్లు చేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే జయహో బీసీ సదస్సు ఉదయభాను ఫుల్..లోకేష్ నిల్ అన్నట్లు సాగింది. ఒక టీవీ షో మాదిరిగా, లేకుంటే కొత్తగా తీసిన సినిమా ప్రమోషన్ కోసం ఏర్పాటు చేసిన షో మాదిరిగా మారిపోయింది. ఇకపోతే, రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన వారిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ బాధితులు అంటూ షోలో పరిచయం చేశారు. ఉదయభాను వాళ్ల ఇళ్లకు వెళ్లి వారి కష్టాలను స్వయంగా తెలుసుకున్నట్లు వేదికమీద చెప్పడంతో అక్కడున్న వాళ్లు నోరెళ్లబెట్టారు. బాధితులని చెప్పే వారితో మాట్లాడించిన తర్వాత లోకేష్ మైక్ తీసుకుని ఆయా కుటుంబాలన్నింటినీ మా అమ్మ భువనేశ్వరి ఆదుకుంటుందని, వారి పిల్లలను మా అమ్మే చదివిస్తుందని చెప్పుకుంటూ షోను ముగించారు.

ఆధునిక అవసరాలకు అనుగుణంగా విద్య

- జాతీయ విద్యావిధానానికి ముచ్చటగా మూడేళ్లు
- సీబీఎస్ఈ పాఠశాలల జిల్లా నోడల్ అధికారి సూర్యప్రకాశరావు



మాట్లాడుతున్న సీబీఎస్ఈ పాఠశాలల జిల్లా నోడల్ అధికారి సూర్యప్రకాశరావు

ఒంగోలు: జాతీయ విద్యావిధానానికి ముచ్చటగా మూడేళ్లు పూర్తయ్యాయని, నేటి ఆధునిక అవసరాలకు అనుగుణంగా రూపొందిన జాతీయ విద్యావిధానం ప్రాముఖ్యతను ప్రతిఒక్కరు సమాజానికి తెలియజేయాలని సీబీఎస్ఈ పాఠశాలల జిల్లా నోడల్ అధికారి బి.సూర్యప్రకాశరావు కోరారు. స్థానిక ఒంగోలు కేంద్రీయ విద్యాలయంలో జిల్లాలోని సీబీఎస్ఈ పాఠశాలల ప్రిన్సిపాళ్లతో గురువారం ఆయన సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన కేంద్రీయ విద్యాలయం, నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్, ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ సమితి, కలుజువ్వలపాడు జవహర్ నవోదయ విద్యాలయ సమితి, ఒంగోలు సాయిబాబా సెంట్రల్ స్కూల్‌తో పాటు జిల్లాలోని పలు సీబీఎస్ఈ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తివంతమైన భారతదేశ ఆవిష్కరణలో భాగంగా నూతన జాతీయ విద్యావిధానం 2020ని కేంద్రం తీసుకొచ్చిందన్నారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాలను బయటకు తీయడం, రొటీన్ లెర్నింగ్ కంటే సమస్య పరిష్కార ఆలోచనను ప్రోత్సహించడం, అధ్యయనం చేయడానికి బదులు నేర్చుకోవడంపై దృష్టిపెట్టడం వంటి అనేక అంశాలు ఇందులో ఇమిడి ఉన్నాయన్నారు. 21వ శతాబ్దపు ఆత్మనిర్భర భారత్ కోసం పాలసీ, అభ్యాసకులలో విజ్ఞానం, నైపుణ్యాలు, విలువలను అభివృద్ధి చేయడం ద్వారా వారిని నిజమైన ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దడం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో సాయిబాబా సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపాల్ మహేష్, కలుజువ్వలపాడు నవోదయ ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్, ఒంగోలు నవోదయ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని జాతీయ విద్యావిధానం ప్రాముఖ్యతపై చర్చించారు.

ఉన్నత విద్యకు పేదరికం అడ్డుకారాదు

- అందుకోసమే జగనన్న విదేశీ విద్యా దీవెన
- కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- జిల్లాలో లబ్ధిదారులైన విద్యార్థులకు రూ.2,46,85,473 విలువైన చెక్కు అందజేత



విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, తదితరులు

ఒంగోలు అర్బన్: ప్రతిభ ఉన్నవారికి విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. ఈ పథకంలో భాగంగా అర్హులైన విద్యార్థులకు బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తున్న సందర్భంగా తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి కలెక్టర్ పాల్గొని అర్హులైన విద్యార్థులకు ఆర్థిక ప్రయోజనాన్ని కల్పిస్తున్న బ్యాంకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుంచి 2022–23, 2023–24 విద్యా సంవత్సరాలకు సంబంధించి 21 మంది విద్యార్థులకు రూ.2,46,85,473 ఆర్థిక ప్రయోజనం కలిగిందని తెలిపారు. ట్యూషన్ ఫీజు, ప్రయాణ ఖర్చులు, వీసా చార్జీలు కూడా ప్రభుత్వమే భరిస్తున్నట్లు వివరించారు. ఈ ఖర్చులన్నీ కలిపి 21 మందికి రూ.4.05 కోట్ల మేరకు ప్రభుత్వం భరిస్తోందన్నారు. అభ్యర్థుల ఎంపికను అత్యంత పారదర్శకంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఎంబీబీఎస్, ఎంబీఏ, ఎంఎస్ కంప్యూటర్ ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, తదితర 21 రకాల కోర్సులు అభ్యసించే అవకాశం కల్పిస్తోందన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం : జెడ్పీ చైర్‌పర్సన్

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ ముఖ్యమంత్రి అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ లింగంగుంట రవిబాబు, సాంఘిక సంక్షేమ శాఖాధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, బీసీ సంక్షేమ అధికారి అంజ, మైనార్టీ సంక్షేమ అధికారి అర్చన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రూ.40 లక్షల ప్రయోజనం కలిగింది

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా ఉన్నత చదువులకు నాకు రూ.40 లక్షల ప్రయోజనం కలిగింది. నా తండ్రి వ్యవసాయం చేస్తుంటారు. సైబర్ సెక్యూరిటీ కోర్సులో బ్రిటన్‌లో మాస్టర్స్ డిగ్రీ చేయాలనే నా ఆశయాన్ని జగనన్న నిజం చేశారు. ఏడాది కోర్సు కోసం రుణం కోసం ప్రయత్నిస్తే బ్యాంకులు తిరస్కరించాయి. కానీ, రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. బ్రిటన్‌లో కోర్సు చేసేందుకు రూ.40 లక్షలు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రికి మా కుటుంబం మొత్తం రుణపడి ఉంటుంది.

– రాయ రోహిత్ యాదవ్,
మొగలువారిపల్లి,
వెలిగండ్ల మండలం

క్లుప్తంగా

ఆధ్యాత్మిక గురువుకు భక్తుల ఘన స్వాగతం


మొరారీబాపు స్వామీజీకి స్వాగతం పలుకుతున్న భక్తులు

మార్కాపురం టౌన్: గుజరాత్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు మొరారీబాపు ప్రత్యేక రైలులో గురువారం మార్కాపురం వచ్చారు. జ్యోతిర్లింగ రామకథా యాత్రలో భాగంగా 1008 మంది శిష్య బృందంతో శ్రీశైలం వెళ్తున్న ఆయనకు స్థానిక రైల్వే స్టేషన్ వద్ద గుజరాత్‌కు చెందిన భక్తులు ఘన స్వాగతం పలికారు. గణపతి చౌదరి, ముఖేష్, దశరథరామిరెడ్డి, మోహన్, పీవీ కృష్ణారావు, శాసనాల వీరబ్రహ్మం తదితరులు స్వామీజీకి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

నాణ్యమైన బియ్యంతో వంటల పోటీలు నేడు

ఒంగోలు అర్బన్: జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రకాశం భవనంలోని స్పందన భవనం వద్ద వంటకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌ఓ ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందజేస్తున్న నాణ్యమైన బియ్యంతో తయారు చేసిన రుచికరమైన వంటలతో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. వంటకాలతోపాటు రేషన్ కార్డు, ఆధార్ వెంట తీసుకురావాలని స్పష్టం చేశారు. ఉత్తమ వంటకాలు తయారు చేసిన వారిని న్యాయ నిర్ణేతలు ఎంపిక చేస్తారని, మొదటి బహుమతిగా రూ.5 వేలు, రెండో బహుమతిగా రూ.3 వేలు, మూడో బహుమతిగా రూ.2 వేల నగదు. పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేస్తామని పేర్కొన్నారు.

మట్టి మిద్దె కూలి వృద్ధురాలు మృతి

కంభం: మట్టి మిద్దె కూలి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన గురువారం కంభంలో చోటుచేసుకుంది. వివరాలు.. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు కంభం పట్టణంలోని శీలం వీధిలో ఓ మట్టి మిద్దె గురువారం ఒక్కసారిగా కూలిపోయింది. అందులో నివాసం ఉంటున్న షేక్.ఫాతిమా(82) అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించి వివరాలు సేకరించారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ

దర్శి: విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రామచంద్రాపురంలో గురువారం జరిగింది. ఎస్సై రామకృష్ణ వివరాల మేరకు..గురువారం వర్షం పడుతుండగా గ్రామానికి చెందిన కల్లూరి రత్తయ్య(48) ఇంట్లో కరెంట్ పోయింది. గ్రామంలో కరెంట్ ఉండి ఇంట్లో పోవడంతో గ్రహించిన రత్తయ్య కర్ర తీసుకొని స్తంభం వద్దకు వెళ్లి పైన వైర్లు లూజుగా ఉన్నాయని భావించి కర్రతో కొట్టడంతో వైర్లు తెగి పైనపడి విద్యుతాఘానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్యాగం, ధర్మనీతికి ప్రతీక మొహర్రం

- ఇస్లాం క్యాలెండర్‌లో మొదటి నెల మొహర్రంతో ప్రారంభం
- రెండు రోజుల ఉపవాస దీక్షకు విశిష్టత
- రేపు మొహర్రం ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


కనిగిరిలో పీర్ల ఊరేగింపు(ఫైల్)

కనిగిరి రూరల్: ఇస్లాం సంవత్సరాది క్యాలెండర్‌లో మొదటి నెల మొహర్రం. ఈ నెలకు అత్యంత ప్రాధాన్యం ఉంది. మొహర్రం నెలలో ఇస్లాంకు సంబంధించి కొన్ని మంచి కార్యాలు, మరికొన్ని విషాద ఘటనలు కూడా చోటు చేసుకున్నట్లు ముస్లిం పెద్దలు తెలిపారు. ప్రధానంగా ఈ నెలలో మహ్మద్ ప్రవక్త మనుమళ్లు ఇమామే హసేన్, ఇమామే హుస్సేన్‌లు ప్రజా సంరక్షణార్థం చేసిన ధర్మనీతి యుద్ధంలో మృతవీరులవుతారు. దీంతో వారి త్యాగనిరతిని, ధర్మనీతిని కీర్తిస్తారు.

ఉపవాసానికి ఎంతో ప్రాముఖ్యత..

మొహర్రం నెలలో రెండు రోజుల ఉపవాస దీక్షలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇమామే హసన్ వంశీకులు మృతవీరులైన దినాల్లోని 9, 10, లేదా, 10,11 రోజుల్లో (నఫీల్ రోజాలు) ఉపవాస దీక్షలు ముస్లింలు ఆచరిస్తారు. ఈ ఉపవాస దీక్షలు ఆచరించడం వల్ల తెలిసి, తెలియక చేసిన ఏడాది పాటు గుణాలను అల్లాహ్ క్షమింప చేస్తారని ముస్లిం నమ్మకం. దీంతో ఎక్కువ మంది ముస్లింలు కుటుంబ సమేతంగా రోజా(ఉపవాస దీక్షలు) ఉంటారు.

ధర్మనీతికి ప్రతీక..

రాజరిక పాలనలో దాయాదులైన హజరత్ అలి, మావియాలు చేరొక రాజ్యాధికారం చేస్తుంటారు. హజరత్ అలికి ఇద్దరు కుమారులు, ఇమామే హసన్, ఇమామే హుస్సేన్. మావియా ఒక కుమారుడు యజీద్. ఈ క్రమంలో హజరత్ అలి చనిపోతారు. అలి కుమారులు చిన్నవాళ్లు కావడంతో సుభిక్ష పాలన చేస్తున్న మావియాకు రాజ్యాధికారాన్ని అప్పగించేందుకు హసన్, హుస్సేన్ కూడా సమ్మతిస్తారు. ఈ నేపథ్యంలో అలి రాజ్యాన్ని కూడా దాయాది అయిన మావియా పరిపాలిస్తాడు. కొన్నేళ్ల తర్వాత హజరత్ మావియా కాలాతీతులవుతారు. దీంతో మావియా కుమారుడు యజీద్ రాజ్యాధికారాన్ని చేపట్టేందుకు పట్టాభిషితుడవుతాడు. అయితే అలి పాలించిన రాజ్యాన్ని కూడా తనకే అప్పగిస్తూ.. సమ్మతి తెలపాలని వరుసకు అన్నదమ్ములైన ఇమామే హసన్, హుస్సేన్‌లను యజీద్ కోరుతాడు. అందుకు హసన్, హుస్సేన్‌లు నిరాకరిస్తారు. ముందు తన పరిపాలన దక్షతను నిరూపించుకోవాలని చెప్తారు. దీంతో అప్పటి నుంచి యజీద్ మనసులో కుట్రను పెంచుకుంటాడు. మంచితనంగా ఉంటూనే ఇమామే హసన్‌పై విషప్రయోగం చేయిస్తాడు. దీంతో అలి కుమారుల్లో పెద్దవాడైన ఇమామే హసన్ మరణిస్తాడు. ఆ తర్వాత కొంత కాలానికి అసలు విషయం ఇమామే హుస్సేన్‌కు తెలుస్తోంది. అయినప్పటి శాంతి, ధర్మం కోసం మౌనం దాల్చుతాడు. ఇస్లాం వ్యాప్తి కోసం పవిత్ర ప్రార్థనలు చేసుకుంటూ ఇమామే హుస్సేన్ దైవ కార్యంలో కాలం గడుపుతుంటారు. ఈ క్రమంలో యజీద్ ఆకృత్యాలు రాజ్యంలో పెరిగిపోతాయి. మద్యానికి బానిసై దైవాన్ని ధిక్కరిస్తూ రాక్షసపాలనకు నాంది పలుకుతాడు. దీంతో రెండు రాజ్యాలకు చెందిన వారు విసిగి వేసారి ఇమామే హుస్సేన్‌ను రాజ్యాధికారం చేపట్టాలని అభ్యర్థిస్తారు. తామంతా మీకు మద్దతుగా నిలుస్తామని యజీద్‌పై యుద్ధం ప్రకటించి రాజ్యాధికారం చేపట్టాలని రహస్య ఉత్తరాల ద్వార దీనంగా వేడుకుంటారు. దీంతో ఇమామే హుస్సేన్ చలించిపోతాడు. ఈక్రమంలో ఇమామే హుస్సేన్ యుద్ధానికి సమాయత్తం అవుతుండగా ముందుగానే గుర్తించిన యజీద్ యుద్ధాన్ని ప్రకటిస్తాడు. హుసేన్ వంశీయులు యుద్ధానికి వెళ్లడానికి నిరాకరిస్తారు. అయినా హుస్సేన్ వినకుండా ప్రజా ప్రయోజనార్థం, ధర్మనీతి రాజ్యస్థాపనకోసం తాను యుద్ధానికి వెళ్లి తిరుతానని నిర్ణయం తీసుకుంటాడు. ఈ క్రమంలో మొహర్రం నెలలో హుస్సేన్ కుటుంబీకులు వందలాది మంది యుద్ధానికి బయలుదేరుతారు.

కర్‌బలాలో...

మదీనా నుంచి ఇమామే హుస్సేన్ వంశీకులు యుద్ధానికి బయలు దేరిన తర్వాత కర్‌బలా మైదానం చేరుకునే సమయంలో ఒక్క సారిగా యజీద్ భారీ సైన్యంతో చుట్టుముట్టుతాడు. హుస్సేన్‌కు సహకరిస్తామని చెప్పివాళ్లు కొందరు ప్రాణ భయంతో వెనుకంజ వేస్తారు. మరి కొందరు యుద్ధ మైదానంలో మద్దతు పలికి అశువులు బాస్తారు. మూడు రోజుల పాటు నిరంతర భీకర యుద్ధం సాగుతుంది. హుస్సేన్ సైన్యానికి కనీసం మంచినీళ్లుకూడా లేకుండా చేసి (చెరువుల్లో, కుంటల్లో విషం కలిపి) చంపుతారు. ఈక్రమంలో హుస్సేన్ కర్‌బలా మైదానంలో నమాజు చేస్తుండగా యజీద్ తన సైన్యం దొంగచాటుగా (సిజ్దా సమయంలో) తల (శిరస్సు)ను ఛేదిస్తాడు. ఈ యుద్ధంలో హుస్సేన్ వంశీకులు వీరమరణం పొందుతారు. అయితే కొద్ది రోజులకే యజీద్ తీవ్ర పశ్చాత్తాపానికి గురై తల్లడిల్లుతాడు. దైవ ప్రవక్త మనవళ్లను చంపి తాను ఘోర తప్పిందం చేసినట్లు భావిస్తాడు. శక్తిహీనుడిగా మారి తీవ్ర మనోవేదనకు లోనవుతాడు. అల్లాహ్ వద్ద శిరస్సు వంచి క్షమాపణ కోరతాడు. తన తప్పును మన్నించాలని కడు దీనంగా యజీద్ అల్లాహ్‌ను వేడుకుంటాడు. ఈ క్రమంలో ఇమామ్ హసేన్, హుస్సేన్ వంశీకులకు లోక కళ్యాణార్థం చూపిన త్యాగ శైలిని, ధర్మనీతిని స్మరిస్తూ మొహర్రం నిర్వహించడం కొనసాగుతుంది.

నేడు తుమ్మలచెరువులో పెద్ద షరిగత్

తర్లుపాడు: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పీర్ల పండగకు ప్రసిద్ధిగాంచిన తుమ్మలచెరువు గ్రామంలో శుక్రవారం పెద్ద షరిగత్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు దర్గా కమిటీ చైర్మన్ సయ్యద్ ఖాశిం తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి స్వామివార్లను గ్రామంలో ఊరేగిస్తారు. కులమతాలకు అతీతంగా నిర్వహించే ఈ వేడుకలకు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించి నైవేద్యం సమర్పిస్తారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, మంచి నీరు, ఆహారం అందించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కాగా, మార్కాపురం డిపో నుంచి తుమ్మలచెరువుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధమైంది. దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పొదిలి సీఐ రాఘవేంద్ర తెలిపారు. తనతోపాటు తర్లుపాడు ఎస్సై వేముల సుధాకర్, పలువురు ఏఎస్సైలు, సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నట్లు చెప్పారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- యాసిడ్ విక్రేతలు, కాలేజీ ప్రతినిధులకు ఎస్పీ మలికా గర్గ్ హెచ్చరిక


మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి యాసిడ్ విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మలికా గర్గ్ హెచ్చరించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయలంలో యాసిడ్ విక్రేతలు, సరఫరాదారులు, కెమికల్ లేబొరేటరీలు కలిగిన కళాశాలల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. మహిళలు, బాలికలపై ప్రాణాంతకమైన యాసిడ్ చల్లడం లాంటి తీవ్రమైన నేరాలను కట్టడి చేయడంలో భాగంగా యాసిడ్ విక్రేతలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. ఏపీ పాయిజన్ యాక్ట్-1958, పోసిషన్స్ అండ్ సేల్ రూల్స్-2016 నిబంధనలను అనుసరించి యాసిడ్ కొనుగోలు, నిల్వ, వినియోగించడం లాంటివి చేయాలని స్పష్టం చేశారు. కలెక్టర్ నుంచి లైసెన్స్ పొందిన వారు మాత్రమే యాసిడ్, కరోజివ్స్ విక్రయించాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. కొనుగోలుదారుల ఆధార్, ఫొటో గుర్తింపు కార్డులు పరిశీలించి, అడ్రస్ నమోదు చేసుకున్న తర్వాతే విక్రయించాలని సూచించారు. 15 రోజులకోసారి యాసిడ్ నిల్వ, విక్రయ వివరాలతో కూడిన నివేదికను ఎస్‌ఓఎంలకు సమర్పించాలని ఆదేశించారు. మైనర్లకు యాసిడ్, కరోజివ్స్ విక్రయించకూడదని, వాటిని నిల్వ ఉంచే ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ప్రభుత్వ విభాగాలకూ ఇవే నిబంధనలు వర్తిస్తాయన్నారు. సమావేశంలో ఏఎస్పీ (అడిషనల్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, డీఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, సీఐలు టి.వెంకటేశ్వర్లు, ఎస్.జగదీష్, ఆర్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు


ప్రణీత్‌కు నగదు బహుమతి అందజేస్తున్న ఎస్పీ మలికా గర్గ్


అనుపమకు నగదు బహుమతి అందజేస్తున్న ఎస్పీ

- పోలీసుల పిల్లలు దేశానికి పేరు తేవాలి
- ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: పోలీసు కుటుంబాల పిల్లలు ఐఐటీ వంటి ప్రతిష్టాత్మకమైన సంస్థల్లో సీటు సాధించడం అభినందనీయమని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఐఐటీ బాంబే కళాశాలలో సీటు సాధించిన ఒంగోలు దిశ సీఐ డి.మల్లికార్జునరావు కుమారుడు గౌరీ ప్రణీత్, ఐఐటీ కాన్పూర్ కళాశాలలో సీటు సాధించిన బాపట్ల జిల్లా మార్టూరు కానిస్టేబుల్ ఎస్.పూర్ణాంజనేయరాజు కుమార్తె ఎస్.అనుపమలను గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అభినందించారు. వారికి ప్రోత్సాహక నగదుతో పాటు ఉన్నత చదువులకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్ అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. సరైన సమయ పాలన, ఏదో సాధించాలనే దృఢసంకల్పంతో ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని సూచించారు. భవిష్యత్‌పై సమగ్ర అవగాహన కలిగి ఉండి భవితకు బాటలు వేసుకోవాలని చెప్పారు. నిరంతర ఒత్తిడితో కూడిన పోలీసులకు కుటుంబసభ్యులతో గడపడానికి తగినంత సమయాన్ని వెచ్చించలేక పోయినా ఉన్న కొద్ది సమయంలోనే పిల్లలకు చక్కగా మార్గదర్శకం చేస్తున్నారని కొనియాడారు. పిల్లల చదువుల కోసం అన్ని వసతులు సమకూరుస్తున్నారని అభినందించారు. పోలీసు కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకోవడం ద్వారా కన్న తలిదండ్రులకు, దేశానికి, పోలీసు శాఖకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు దిశ పీఎస్ సీఐ డి.మల్లికార్జునరావు, మార్టూరు కానిస్టేబుల్ దంపతులు పూర్ణాంజనేయరాజు, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎల్లో మీడియాది దిగజారుడు పాత్రికేయం

- తనపై ఎవరో దాడి చేసినట్లు పచ్చి అబద్ధాలు రాస్తారా
- అమర్నాథ్ యాత్ర టికెట్ 3 నెలల ముందే బుక్ చేసుకున్నా
- ఎమ్మెల్యే కేపీ కుటుంబంతో మాది విడదీయరాని బంధం
- తప్పుడు రాతలపై న్యాయ పోరాటం చేస్తా
- మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ



మార్కాపురం: 'జర్నలిజంలో ఇంత నీచానికి దిగజారి వార్తలు రాయడం, నా 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదు. మూడు నెలల ముందే అమర్నాథ్ యాత్రకు టికెట్ బుక్ చేసుకుంటారన్న విషయం కూడా తెలియని స్థితిలో కొంత మంది మీడియా మిత్రులు ఉండటం శోచనీయమ'ని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం 'ఈనాడు' పత్రికలో ప్రచురించిన కథనంపై స్పందించిన ఆయన తన చాంబర్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా ఎల్లో మీడియా, టీడీపీ అనుకూల సోషల్‌మీడియా ప్లాట్‌ఫాంలపై తన గురించి అభూత కల్పనలు ప్రసారం చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. తనపై ఎవరో దాడి చేసినట్లుగా పత్రికల్లో రాయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. తాను మూడు నెలల ముందే అమర్నాథ్ యాత్రకు వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్నానని తెలిపారు. అప్పటికప్పుడు ఎవరైనా అమర్నాథ్ యాత్రకు వెళ్లే అవకాశం ఉందా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి తనకు మధ్య విభేదాలు సృష్టించేందుకు చాలా కాలం నుంచి అనేక మంది అనేక రకాలుగా ప్రయత్నిస్తున్నారని ప్రస్తావించారు. తన తండ్రి చెంచయ్యతో 1965 నుంచి కేపీ కొండారెడ్డి కుటుంబంతో మంచి సంబంధాలు ఉన్నాయని, తమ బంధాన్ని ఎవరూ విడదీయలేరన్నారు. పచ్చ పత్రికల తప్పుడు రాతలపై న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నానని, ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సహకారంతో చైర్మన్ పదవి పొందానని చెప్పారు. రెండేళ్ల నాలుగు నెలల పదవీ కాలంలో ఎలాంటి ఆరోపణలు లేకుండా పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్న తనపై అభూత కల్పనలు రాయడం దారుణమన్నారు. వాస్తవాలు తెలుసుకుని వార్తలు రాస్తేనే ప్రజలు విశ్వసిస్తారని హితవుపలికారు.

335 బాటిళ్ల అక్రమ మద్యం పట్టివేత


జమ్ములపాలెం గ్రామంలో మద్యం నిల్వ ఉంచిన కారును పరిశీలిస్తున్న ఎస్సై

టంగుటూరు: పాండిచ్చేరి నుంచి తీసుకువచ్చి పెద్ద మొత్తంలో నిల్వ చేసి విక్రయిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన జమ్ములపాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. టంగుటూరు మండలంలోని జమ్ములపాలెం గ్రామానికి చెందిన పక్కెల కుమార్‌బాబు పొరుగు రాష్ట్రాల నుంచి మద్యాన్ని పెద్ద మొత్తంలో తీసుకొచ్చి ఇంట్లో నిల్వ ఉంచి విక్రయిస్తున్నాడు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వస్తుండటంతో దీనినే వ్యాపారంగా మలుచుకున్నాడు. చుట్టుపక్కల గ్రామాల్లో తెలిసిన వారికి మాత్రమే గుట్టుగా విక్రయిస్తూ డబ్బు సంపాదిస్తున్నాడు. మద్యం సీసాలను కోరిన వారికి బైక్‌పై వెళ్లి అందిస్తుండటంతో స్థానికుల నుంచి పోలీసులకు ఫిర్యాదులు అందాయి. సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్ ఆధ్వర్యంలో ఎస్సై ఖాదర్‌బాషా తన సిబ్బందితో ఉదయం ఏడు గంటలకు నిందితుడి ఇంటికి చేరుకున్నారు. పోలీసుల రాకను పసిగట్టిన కుమార్‌బాబు అక్కడ నుంచి పరారయ్యాడు. పోలీసులు ఇంటి పరిసరాల్లో తనిఖీ చేయగా నాలుగు ఫుల్ బాటిళ్లు లభించాయి. అలాగే ఇంటి సమీపంలో కారు అనుమానాస్పదంగా కనిపించటంతో తాళాలు కోసే వ్యక్తిని రప్పించి డూప్లికేట్ తాళం తయారు చేయించారు. స్థానికుల సమక్షంలో కారు డిక్కీ తెరిచి, అందులో ఉన్న 331 క్వార్టర్, 4 ఫుల్ బాటిళ్లను సీజ్ చేశారు. మద్యం నిల్వ ఉంచిన కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు, కుమార్‌బాబుకు సహకరిస్తున్న భార్య పక్కెల రాజేశ్వరిని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసు స్టేషనకు తరలించారు. పరారీలో ఉన్న పక్కెల కుమార్‌బాబు కోసం పోలీసులు గాలిస్తున్నారు.

నేడు మార్కాపురంలో జగనన్న మహిళా మార్ట్ ప్రారంభం

- హాజరుకానున్న మున్సిపల్ శాఖామంత్రి సురేష్


మంత్రి సురేష్‌ను సన్మానిస్తున్న డీఆర్‌డీఏ పీడీ రవికుమార్

మార్కాపురం: మార్కాపురం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్ట్‌ను శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రారంభిస్తారని డీఆర్‌డీఏ పీడీ రవికుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన మార్కాపురం వచ్చి మంత్రి సురేష్‌ను ఆహ్వానించి సన్మానించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, మెప్మా ఎండీ విజయలక్ష్మితోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు హాజరుకావాలని కోరారు. అలాగే క్లాప్ పథకం కింద 21 ఇ-ఆటోలను మంత్రి సురేష్ ప్రారంభిస్తారని, కౌన్సిల్ హాలులో మంత్రి సురేష్‌కు, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి సన్మానం అనంతరం వినతులు స్వీకరిస్తారని మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ తెలిపారు.

ప్రారంభించని పనులు రద్దు

- కలెక్టర్ దినేష్‌కుమార్


డీఎంఎఫ్‌టీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఒంగోలు, కందుకూరు, మార్కాపురంలో చేపట్టేందుకు మంజూరైన పనుల్లో ప్రారంభంకాని వాటిని రద్దు చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. గురువారం ప్రకాశం భవనంలో 14వ జిల్లా ఖనిజ నిధి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు నిర్ణయాలను ప్రకటించారు. గతంలో దర్శి, సంతనూతలపాడు నియోజకవర్గాకు సంబంధించి మొత్తం 129 పనులకు రూ.7.20 కోట్లు డీఎంఎఫ్ నిధులు మంజూరు చేశారు. కొండపి, ఒంగోలు, సంతనూతలపాడు, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాల్లో 34 పనులకు డీఎంఎఫ్ నిధుల ద్వారా అనుమతుల కోసం ప్రతిపాదనలు చేశారు. వీటిలో ప్రారంభించని పనులు రద్దు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బీసీ సంక్షేమాధికారి లక్ష్మానాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.